ఎల్పీజీ సిలిండర్ల స్వాధీనం



2



2

శెట్పల్లిలో కోతులు మాయం

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## 19న ఆర్ఎస్ఎస్ ఉగాది ఉత్సవం

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రీయ స్వయం సేవక్ ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉగాది మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నగర కార్యవాహ అర్గుల సత్యం తెలిపారు. నగరంలోని వినాయక్ నగర్‌లో ఉన్న బస్వాగార్డెన్‌లో సాయత్రం 6 గంటలకు ఉంటుందన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ పుట్టినరోజు కూడా ఉగాది రోజు కావడం ప్రత్యేకమైనదిగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యుడు జక్కరవి, ప్రధాన వక్తగా తెలంగాణ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ, ఇందూర్ విభాగ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.





## సివిల్స్ ర్యాంకర్ వర్షిత్ రెడ్డికి గ్రామస్థుల సన్మానం

**అక్షరటుడే, భీమ్‌గల్:** దేశ అత్యున్నత సర్వీసులైన సివిల్ సర్వీసెస్‌లో 259వ ర్యాంకు సాధించి ముచ్కూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన వర్షిత్ రెడ్డిని గ్రామస్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చేరుకున్న వర్షిత్ రెడ్డికి యువకులు, పెద్దలు డప్పుచప్పుళ్లతో, పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో పుట్టి, పట్టుదలతో శ్రమించి నేడు ఐఏఎస్/ఐపీఎస్ స్థాయికి ఎదగడం ముచ్కూర్ గర్వించదగ్గ విషయమని కొనియాడారు. వర్షిత్ విజయం నేటి యువతకు, విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని ఆకాంక్షించారు. సన్మానం అనంతరం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. తన విజయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. క్రమశిక్షణతో కూడిన పఠనం, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన యువతకు పిలుపునిచ్చారు. మారుమూల గ్రామాల నుంచి కూడా సివిల్స్ లాంటి పరీక్షల్లో విజయం సాధించవచ్చని తాను నిరూపించానన్నారు. భవిష్యత్తులో ప్రజా సేవకు అంకితమవుతానని తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాల్సిందే..





**అక్షరటుడే, ఇందూరు:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు నరాల సుధాకర్ డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఫీజు పోరు దీక్ష'కు తరలి వెళ్లారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌లో 'ఫీజు పోరు దీక్ష' నిర్వహిస్తున్నట్లు నరాల సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులు విడుదల కాకపోవడంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నరాల సుధాకర్‌తో పాటు దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, బగ్గలి అజయ్, చంద్రకాంత్, సాయి బసవ, దయానంద్, సందేశ్, సందీప్, నరేష్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





# మృత్యు ప్రయాణాలు

**రోడ్డు ప్రమాదాలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యంతో క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఫలితంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా, జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నా వాహనదారులు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. - అక్షరటుడే, కామారెడ్డి**

- రోడ్లపై ఛిద్రమవుతున్న జీవితాలు
- నిబంధనలు పాటించని వాహనదారులు
- మద్యం, నిద్రమత్తులో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా పోలీసులు బ్లాక్ స్పాట్లు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా డ్రైవర్ల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా ప్రమాదాలు కలవర పెడుతున్నాయి. ఓ డీసీఎం డ్రైవర్ భారీగా మద్యం సేవించి పోలీసులకు చిక్కగా.. మరొక డ్రైవర్‌కు నిద్రమత్తు ఆవహించి నలుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈ రెండు ఘటనలు జాతీయ రహదారిపైనే చోటుచేసుకోవడం గమనార్హం. రహదారులపై వాహనదారులు జాగ్రత్తలు పాటించడం లేదు. దీంతో ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.

### మద్యం మత్తులో..

హైదరాబాద్ నుంచి నిజామాబాద్ మీదుగా జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ దారిలో వాహనదారులు అతివేగంగా ప్రయాణాలు చేస్తున్నారు. పలువురు మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు ఎక్కడికక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల ఆపరేషన్ కవచ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ డీసీఎం డ్రైవర్ భారీగా మద్యం సేవించినట్టు తేలడంతో వెంటనే కేసు నమోదు చేశారు.

### ప్రాణాలు తీసిన నిద్రమత్తు

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి ప్రాంతంలో డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో ప్రైవేట్ బస్సు బోల్తాపడి నలుగురు మృతి చెందారు. ఈ నెల 13 న జరిగిన ఈ ఘటనలో నలుగురు మృత్యువాత పడగా 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి అతివేగం, డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే కారణమని పోలీసులు పేర్కొన్నారు. తరచుగా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు నిద్ర లేకపోతే ఆ సమయంలో రోడ్డు పక్కన వాహనం నిలిపి కాసేపు పడుకుంటే నిద్ర తేలిపోయే అవకాశాలు ఉన్నాయని పోలీసులు, ఆర్టీఏ అధికారులు చెప్తున్నారు. అలా చేయకుండా నిద్ర ఆవహిస్తున్నా డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

### నిరంతర తనిఖీలు




రోడ్డు ప్రమాదాల నివారణకు ఆపరేషన్ కవచ్ కార్యక్రమంలో భాగంగా నిరంతరం తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ఎక్కడికక్కడ డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. బ్లాక్ స్పాట్లు గుర్తించి ప్రమాదాలను తగ్గించాం. గతంలో కంటే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయి. వాహనదారులు ప్రతి ఒక్కరు పోలీసుల నిబంధనలు పాటించాలి.

– రాజేష్ చంద్ర, కామారెడ్డి ఎస్పీ

## అమ్మ నగర్ అభివృద్ధికి కృషి

**అక్షర టుడే, ఇందూరు:** అమ్మ నగర్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మేయర్ ఉమారాణి రమేష్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన మేయర్‌ను నగరంలోని అమ్మ నగర్ హౌస్ హోల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నగర అభివృద్ధి తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే కార్పొరేటర్లు ప్రమోద్, పుల్గం వైష్ణవి సుధా, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, పంచ రెడ్డి లలితా చరణ్, మధులను సన్మానించారు. అనంతరం కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎండల కిషన్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి కిషన్, గౌరవాధ్యక్షుడు రేంజర్ల నరేష్, ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, కోశాధికారి మహేందర్, ఎర్రన్న శంకర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.





## కామారెడ్డిలో మట్టి స్నానం..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ సంయుక్త ఆధ్వర్యంలో కామారెడ్డి పెద్ద చెరువు వద్ద భారీ స్థాయిలో మట్టి స్నానాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినూత్న కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు 130 మంది యోగా సాధకులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. ప్రకృతి వైద్యంలో అత్యంత కీలకమైన మట్టి స్నానం ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగా రాంరెడ్డి తెలిపారు. ఆధునిక జీవనశైలిలో మానవుడు ప్రకృతికి దూరమవుతున్నాడని, తిరిగి ప్రకృతి ఒడిలోకి చేరినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్నారు. మట్టి స్నానం అనేది కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదని, ఇది ఒక అద్భుతమైన చికిత్స అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖులు బాస రఘుకుమార్, రాజ్ కుమార్, రమేష్, సిద్దాగౌడ్, ఎల్లయ్య, అంజయ్య, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## విద్యుత్ అంతరాయాల నివారణకు ఎమర్జెన్సీ రీస్టోరేషన్ టీం వాహనాలు

**అక్షరటుడ, ఇందూరు:** నిజామాబాద్ సర్కిల్ పరిధిలో విద్యుత్ అంతరాయాల నివారణకు ఎమర్జెన్సీ రీస్టోరేషన్ టీమ్ వాహనాలు ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ రాజేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వివరాలు వెల్లడించారు. ప్రకృతి విపత్తులైన భారీ వర్షాలు, ఈదురు గాలులు, సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు త్వరితగతిన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎస్ఈ తెలిపారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలో 3 ఈఆర్టీ (ఎమర్జెన్సీ రీస్టోరేషన్ టీమ్) వాహనాలను, టీంను కూడా వినియోగిస్తున్నామని వెల్లడించారు. అదేవిధంగా సబ్‌డివిజన్ స్థాయిలో 14 వాహనాలను సిద్ధంగా ఉంచి అత్యవసర పరిస్థితుల్లో వినియోగిస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ పేర్కొన్నారు. ఈ వాహనాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులకు అవసరమైన కండక్టర్లు, ఇన్సులేటర్లు, కేబుల్స్, టూల్స్ తదితర మెటీరియల్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.14.50 కోట్ల నిధులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మోడల్ ఎల్లారెడ్డిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవతో గ్రామాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు, ముఖ్యంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం రూ.14.50 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఈ మేరకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల కావడంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి, నాగిరెడ్డిపేట్, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, రామారెడ్డి మండల పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

## కలెక్టరేట్‌లో బసకు ఏబీవీపీ నాయకుల యత్నం.. అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి:** ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం మొద్దునిద్ర వీడడం లేదని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకకు ఆదివారం రాత్రి కలెక్టరేట్‌లో బస చేయడానికి ప్రయత్నించారు. కలెక్టరేట్ గేటు మూసివేసి ఉండడంతో గేటు ముందు రహదారి పక్కన పడుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ రామన్, ఎస్సై భువనేశ్వర్ పోలీస్ సిబ్బందితో కలెక్టరేట్ వద్దకు చేరుకుని నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. రాత్రిపూట ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రమాదం ఉంటుందని, ఇలా చేయడం సరికాదని సీఐ వారించారు. ఉదయం వచ్చి ధర్నా చేసుకోవచ్చని సూచించినా నాయకులు వినకపోవడంతో పోలీసులు అరెస్ట్ చేసి దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ చరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల బలిదానాలతో తెలంగాణ వచ్చిందని, 2014 నుంచి ఇప్పటివరకు సరైన సమయంలో స్కాలర్‌షిప్ రాక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు.

### షబ్బీర్‌అలీని కామారెడ్డి రానివ్వం..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రూ.8వేల కోట్లు ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలు రేవంత్ రెడ్డి వస్తే రూ.4 వేల కోట్లకు తగ్గుతుందనుకుంటే మరొక రూ. వెయ్యి కోట్లు పెరిగిందన్నారు. స్కాలర్ షిప్ రాక క్యాటరింగ్‌కు విద్యార్థులు వెళ్లే పరిస్థితి నెలకొందని, అలా వచ్చిన డబ్బుతో కళాశాలల్లో సర్టిఫికెట్లు తీసుకుంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై షబ్బీర్ అలీ మాట్లాడకపోతే కామారెడ్డికి రానివ్వమని, ఇదొక హెచ్చరికలా భావించాలన్నారు.

## వైశ్య ప్రజాప్రతినిధులకు సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం, రాష్ట్ర ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఎల్లా రెడ్డి మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తాను సన్మానించారు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైశ్య ప్రజా ప్రతినిధులకు హైదరాబాద్‌లోని ముషీరాబాద్ వైశ్య హాస్టల్‌లో ఏర్పాటు చేసిన అభి నందన సభలో ఆయనను సత్కరించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఆరు మున్సిపాలిటీల్లో ఎన్నికైన ఛైర్మన్లు, ఆరుగురు మున్సిపల్ వైస్ ఛైర్మన్లు, 49 మంది వార్డు కౌన్సిలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ వైశ్యులు రాజకీయంగా ఎద గాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారంతో పాటు రాజకీయాల్లో రాణించాలని, రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించే వైశ్యులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. దానధర్మాల్లో ముం దుండే వైశ్యులు రాజకీయాల్లో కూడా ముందుండాలని సూచిం చారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ప్రజాప్రతినిధులకు శాసనమండలి సభ్యుడు బుగ్గారపు దయానంద్, ఆల్ ఇండియా వైశ్య ఫెడరేషన్ సెంట్రల్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, సెంట్రల్ కమిటీ అడ్వై జర్ గంజి రాజమౌళి, రాష్ట్ర ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చంద్రప్రకాష్ గుప్తా, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత తదితరులు ఘనంగా సన్మానించారు. వైశ్య ప్రముఖులు దివంగత భూపతి కృష్ణమూర్తి శతజయంతి ఉత్సవంలో భాగంగా ప్రజాప్రతినిధులను సన్మానించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సికింద్రాబాద్‌కు చెందిన వైశ్య ప్రముఖులతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల్లేని గ్రామం శెట్‌పల్లి..



■ మాట నిలబెట్టుకున్న సర్పంచ్ ■ 2 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు
■ వానరాలను పట్టుకుని అడవిలో వదిలేసిన వైనం..

**ఊరి కోసం ఎంత చేసినా తక్కువేనంటారు.. అయితే గ్రామంలోని రైతులు, ప్రజలు కోతుల సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గ్రహించిన ఓ అభ్యర్థి వాటి బెడదను దూరం చేస్తానని మాటిచ్చి ఎన్నికల్లో నిలబడ్డారు. గెలిచిన అనంతరం మాట నిలబెట్టుకున్నారు. అతడే శెట్‌పల్లి సర్పంచ్ అట్టెం శ్రీనివాస్. ఇదేవిధంగా మండలంలోని అనేక గ్రామాల్లో కోతుల బెడద, కుక్కల బెడద ఉండడంతో ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.** – అక్షరటుడే, లింగంపేట

లింగంపేట మండలంలోని శెట్‌పల్లి వ్యవసాయ ఆధారిత గ్రామం. ప్రజలు పాడి పరిశ్రమ, పంటలు సాగుచేస్తూ జీవనం కొనసాగిస్తుంటారు. గతంలో ఈ గ్రామంలో అసలు కోతులు ఉండేవి కాదు. కాలక్రమేణ కోతుల బెడద పెరిగిపోవడంతో ప్రజలపై దాడి చేయడం, చిన్నపిల్లలను కరవడం, పంటల సాగు చేసేందుకు రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామంలోని పెంకుటిళ్లు సైతం కోతుల బెడదకు ధ్వంసమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యను అరికట్టేందుకు సర్పంచ్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గ్రామంలో కోతులు లేకుండా చేస్తానని స్థానిక నాయకుడు హామీ ఇచ్చాడు. ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ అట్టెం శ్రీను ఇచ్చిన మాట ప్రకారం కోతులను పట్టేవారిని తీసుకువచ్చి వాటిని బోనులో బంధించి నర్సాపురం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.



### రెండువేల ఎకరాల్లో పంటల సాగు

గతంలో ఉమ్మడి జీపీగా ఉన్న శెట్‌పల్లి అయ్యాపల్లి, అయ్యాపల్లి తండాల పరిధిలో సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తుంటారు. పంటలను కోతులు అనేక రకాలుగా విధ్వంసం సృష్టించడంతో రైతులు చెయ్యని ప్రయత్నం లేదు. కోతుల నుంచి పంటలను రక్షించుకోవడానికి 24 గంటల పాటు పంట కావలి ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామంలో కోతుల బెడద లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు.

### రైతుల మేలు కోసమే..



గ్రామంలో కోతుల బెడదతో పంటలను పండించాలంటే రైతులకు పెను సవాల్‌గా మారింది. అలాగే కోతులు ఇళ్లను ధ్వంసం చేసేవి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందుకే కోతులను పట్టేవారిని తీసుకువచ్చి ఒక్క కోతికి పట్టేందుకు రూ 300 చెల్లించి వాటిని వంద కిలోమీటర్ల దూరంలో నర్సాపూర్ అటవీ ప్రాంతంలో వదిలి పెట్టి వచ్చాం. – అట్టెం శ్రీనివాస్, సర్పంచ్

### ఇబ్బంది పడేవాళ్లం..



కోతులతో పంటలను సాగు చేయాలంటే ఇబ్బందిగా ఉండేది. చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేస్తుండడంతో నష్టపోయే వాళ్లం. సర్పంచ్ తీసుకున్న నిర్ణయం రైతులకు మేలు చేకూరింది. – కేతావత్ ఫుల్ సింగ్, రైతు



## వేంపల్లిలో పంచాయతీ సిబ్బందికి సన్మానం

**అక్షరటుడే, ముప్కాల్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వేంపల్లి పంచాయతీ కార్యాలయంలో సిబ్బందిని ఘనంగా సన్మానించినట్లు సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్ తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో సిబ్బంది చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ వారికి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, కారోబార్ కిషోర్, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని తాడ్కోల్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు ఆదివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్‌కుమార్ పారిశుధ్య కార్మికులను సన్మానించి.. వారి సేవలను కొనియాడారు. గ్రామ శుభ్రత కోసం వారు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి ప్రశాంతి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 31 ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం

**అక్షరటుడే, కామారెడ్డి:** గ్యాస్ కొరత నేపథ్యంలో సివిల్ సప్లయ్స్ అధికారులు దాడులను ముమ్మరం చేశారు. శనివారం జిల్లాలోని వివిధ మండలాల్లో చేపట్టిన తనిఖీలలో 30 సిలిండర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు ఆదివారం కూడా దాడులు కొనసాగించారు. ఈ దాడుల్లో 31 ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, గాంధారి, జుక్కల్ మండలాలలో పలు హోటళ్లు, మెస్‌లలో అధికారులు దాడులు నిర్వహించారు. గృహావసరాలకు వినియోగించాల్సిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్టుగా గుర్తించారు. 30 సంస్థలలో 31 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.



## కాంగ్రెస్‌లో చేరిక



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహమ్మద్ నగర్‌లో ఆదివారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మోతీ రామగౌడ్, కాశీరాం, యువ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

## భక్తిశ్రద్ధలతో బండారి మల్లన్న విగ్రహ ప్రతిష్ఠానోత్సవాలు

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం వెంచిర్యాల గ్రామంలో బండారి మల్లన్న విగ్రహ ప్రతిష్ఠ వారోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ముప్కాల్ మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెంచిర్యాల యాదవ సంఘం పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సర్పంచ్ నిమ్మల రాజమణి-శ్రీనివాస్, బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.



## జల్సాల కోసం ఆటో చోరీ.. నిందితుడి అరెస్ట్..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జల్సాల కోసం ఓ యువకుడు చోరీలకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపారు. నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదివారం వివరాలు వెల్లడించారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్ నివాసి అయిన జిన్నా నర్సింలు ఈనెల 12న తన ఆటో చోరీకి గురైందని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనంతరం నెహ్రూనగర్‌కు చెందిన నిందితుడు షేక్ నయీంను అదుపులోకి తీసుకున్నాడు. తాగుడు, జల్సాలకు అలవాటు పడ్డ నిందితుడు డబ్బుల కోసం ఆటో చోరీ చేసి విక్రయిద్దామని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆర్ఆర్ చౌరస్తా వద్ద పార్క్ చేసిన ఆటోను చోరీ చేసి నాందేడ్‌లో విక్రయించేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో పోలీసులు వలపన్ని అతడిని అర్సపల్లి బైపాస్ వద్ద ఆటోతో సహా పట్టుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించాడని.. అతడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపర్చి అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో చురుకుగా వ్యవహరించిన ఎస్సై గంగాధర్, ఐదో టౌన్ సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

## విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అగ్ని ప్రమాదాలు సంబంధించినప్పుడు ప్రజల ప్రాణాలను రక్షించడంలో అగ్నిమాపకశాఖ కీలకపాత్ర పోషిస్తుందని అగ్నిమాపక శాఖ అధికారి వినోద్ అన్నారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని బీసీ బాలల వసతి గృహంలో అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర సమయాల్లో 101/112కి కాల్ చేయడం, సురక్షితంగా బయటపడే మార్గాలు, మాక్ డ్రిల్స్‌తో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు విద్యార్థులను సిద్ధం చేయడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మంటలు లేదా పొగను గమనించిన వెంటనే ఇతరులను అప్రమత్తం చేయాలని సూచించారు. అత్యవసరంగా అక్కడి నుంచి నిష్క్రమించే విధంగా చురుకుగా స్పందించాలన్నారు. పొగ ఎక్కువగా ఉంటే కిందకు వంగి నడవాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలి, మంటలను ఎలా ఆర్పాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లిఫ్ట్‌లను అస్సలు ఉపయోగించకూడదని.. కేవలం మెట్లు మాత్రమే వాడాలన అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇళ్లలో కూడా అగ్ని ప్రమాదాల గురించి తల్లిదండ్రులకు చెప్పి, జాగ్రత్తలు తీసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఫైర్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు ప్రాంతంలో చెట్లు పెరిగి విద్యుత్ తీగలకు తగలడంతో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయాన్ని స్థానిక కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్య సాగర్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు వెంటనే స్పందించి చెట్ల కొమ్మలను తొలగించారు. అయితే ఆ ప్రాంతంలో కొన్ని విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను సరిచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, విద్యుత్ శాఖ సిబ్బంది లైన్‌మన్ శశికాంత్ రెడ్డి, అరుణ్, సంతోష్, కాలనీవాసులు అవుసుల నవీన్ కుమార్, శ్యాం, డాక్టర్ శ్యాం, సాయిబాబా, వెంకట్రాం రెడ్డి, ప్రసాద్, బీసీ నేత శంకర్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, చెత్త, చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను స్వచ్ఛంద సంస్థ సహకారంతో తొలగించామన్నారు. అనంతరం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. 46 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేదశ్రీ రాజ్ కుమార్, జంగిడి భోజన్న, కుతాడి ఎల్లయ్య, సాయి చరణ్, బంటు సుమన్, మహేష్ అగర్వాల్, రాహుల్ రాజ్, కుంకింగ్ నరేష్, జహీర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని కల్లడి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వారిని ఘనంగా సన్మానించారు. 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో చెత్త సేకరణ, డ్రెయినేజీల శుభ్రత, వీధుల పరిశుభ్రత వంటి పనులను నిబద్ధతతో నిర్వహిస్తూ గ్రామానికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించడంతో పాటు వారి సేవలను గుర్తిస్తూ నెలకు సరిపడా సబ్బులు, అవసరమైన సరఫరా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బానుక చంద్రశేఖర్, ఉప సర్పంచ్ ఇస్సపల్లి రాజు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పరామర్శ



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలను బీజేపీ రాష్ట్ర నాయకులు పరామర్శించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంద్రసేనా రెడ్డి, బీజేపీ జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ నాయకుడు కోనేరు శశాంక్ స్థానిక బీజేపీ కార్యకర్తలు, నాయకులను ఆదివారం కలిశారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్యకర్తలకు ధైర్యం చెప్పి, పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ నాయకత్వం వారి వెంట నిలుస్తుందని, కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.